తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



ఏఎస్‌పేటలో మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఉదయగిరి: వర్షాలతో వరి, మొక్కజొన్న పంటలను తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉదయగిరి ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి సూచించారు. మండలంలోని కొండాయపాళెం, కృష్ణంపల్లి గ్రామాల్లో సాగులో ఉన్న వరి, మొక్కజొన్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గుర్తించి నివారణకు కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్‌ను లీటర్ నీటికి 1.5 గ్రాములను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అగ్గి తెగులు నివారణకు లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. చిరు పొట్టదశలో పొటాష్‌ను పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను 1 గ్రామును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఓ ఆంజనేయనాయక్ ఉన్నారు.

మొక్కజొన్న తోటల పరిశీలన

అనుమసముద్రంపేట: గుడిపాడు ఆర్బీకే పరిధిలోని కొత్తపల్లిలో మొక్కజొన్న పంటను ఆత్మ డీడీఏ శివన్నారాయణ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డీ విజయ్‌కుమార్‌నాయక్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. 20–25 రోజుల మొక్కజొన్న పైరు ఆకు సుడులలో కార్బొఫ్యూరాన్ గుళికలను వేయడం వల్ల మొవ్వ పురుగును నివారించవచ్చునని తెలిపారు. ఎకరాకు 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయడం ద్వారా పురుగు ఉధృతి నుంచి పైరును కాపాడుకోచ్చునని చెప్పారు. పక్షి స్థావరాలను ఏర్పాటుతో లద్దె పురుగులను నిర్మూలించవచ్చునని తెలిపారు. మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5ఎస్‌డీ 80 గ్రామాలు లేదా స్పైనోశాండ్ 45% 60 మి.లీ.ను ఆకులు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజాకుమారి, ఏఎస్‌పేట మండల వ్యవసాయాధికారిణి టీ రజనీ, ఏఈఓ చిరంజీవి, వీఏఏ టీ మనోహర్ పాల్గొన్నారు.

పొగాకు నారుమడుల పరిశీలన

ఆత్మకూరురూరల్: వెంకట్రావుపల్లి ఆర్బీకే పరిధిలోని జాలయ్యనగరంలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పొగాకు నారుమడులను జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డీడీఏ శివన్నారాయణ, ఏఓ శైలజ, శాస్త్రవేత్త విజయ్‌నాయక్, ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ పరిశీలించారు. డీడీఏ శివన్నారాయణ మాట్లాడుతూ పొగనారుకు కప్పకన్ను తెగులు సోకి ఉంటే సాఫ్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నారుకుళ్లు తెగులు నివారణకు బ్లైటాక్స్ 3 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. శాస్త్రవేత్త విజయ్‌నాయక్, ఏఓ శైలజ, ఏడీఏ దేవసేనమ్మ,ఏఈఓ కృష్ణవేణి, ఎంపీఈఓ ఏ ఇంద్రాణి, రైతులు పాల్గొన్నారు.

వరి నారుమడుల పరిశీలన

సోమశిల: లింగంగుంటలో వరి నారుమడులను ఏఓ శ్రీధర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మూడ్రోజులుగా నారుమడులు నీట మునిగి ఉన్నాయని, మడుల్లోని నీరు బయటకు పోవడానికి మరో మూడ్రోజుల సమయం పడుతుందని తెలిపారు. ఈ కారణంగా నారుమడులు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అందువల్ల సాగు ఆలస్యం కాకుండా మళ్లీ నారుమడులు పోసుకోవాలని రైతులకు సూచించారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల సంరక్షణకు చర్యలు

కావలి: తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కావలి ఉద్యాన శాఖ అధికారిణి సుధామయి రైతులకు సూచించారు. కావలి సబ్ డివజనల్ పరిధిలో 186 హెక్టార్లలో మిరప,10 హెక్టార్లలో కూరగాయ తోటలు, 2 హెక్టార్లలో అరటి, 20 హెక్టార్లలో మామిడి తోటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. మామిడి తోటల్లో తడి అరడానికి ఎకరాకు 50 కేజీల యూరియా చల్లుకోవాలని సూచించారు. మిరప, కూరగాయ తోటలు అధిక తేమతో ఉరకెత్తకుండా లీటరు నీటికి 10 గ్రాముల యూరియా లేదా 10 గ్రా 19.19.19ను పిచికారీ చేయాలని తెలిపారు. వేరుకుళ్లు తెగులు నివారణకు లీటర్ నీటికి 3 గ్రా బ్లైటాక్స్ లేదా రిడోమిల్, 1 గ్రా స్ట్రెపటోసైక్లిన్ కలిపిన ద్రావణాన్ని మొక్క మొదళ్లలో పోయాలని సూచించారు.



ఉదయగిరి: వరిని పరిశీలిస్తున్న ఏడీఏ చెన్నారెడ్డి



ఆత్మకూరురూరల్: పొగాకు నారుమడులను పరిశీలిస్తున్న అధికారులు



సోమశిల: వరి నారుమడులను పరిశీలిస్తున్న ఏఓ శ్రీధర్‌రెడ్డి

క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోండి



బీఎల్వోలతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్

జలదంకి: 18 ఏళ్లు నిండిన వారందరూ ఈ నెల 9వ తేదీ లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఏవీ రమణారావు కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని బీఎల్వోలకు సూచించారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు సక్రమంగా ఉండేలా బీఎల్వోలు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఓటరు నమోదు కోసం ఫారం–6, తొలగింపునకు ఫారం–7, మార్పులు, చేర్పుల కోసం ఫారం –8 ఉపయోగించాలని సూచించారు.అనంతరం ఓటరు దరఖాస్తు ఫారాలు, బీఎల్వోల రిజిష్టర్లను పరిశీలించారు. డీటీ భరత్, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



జలదంకి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బత్తిన సింగయ్య కోరారు. జలదంకి, గోపన్నపాళెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల్ యోజన, ఆయుష్మాన్ భారత్, తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. అర్హులైన వారికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ విధానాన్ని ప్రదర్శించారు. ఎంఈఓ శ్రీధర్, ఏఓ శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఏపీఎం శ్రీధర్‌రావు, బీజేపీ నాయకులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, గోపన్నపాళెం సర్పంచ్ గుండు వెంకారెడ్డి పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్



ఉదయగిరి: పట్టణంలో సంచరిస్తున్న వీధి కుక్కలకు సర్పంచ్ పీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో పంచాయతీ ఈఓ నర్సయ్య గురువారం రేబిస్ వ్యాక్సిన్లు వేయించారు. పట్టణ ప్రజల ఫిర్యాదు మేరకు వీధి కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేశామని ఈఓ చెప్పారు. నెల్లూరుకు చెందిన ఉమా ఫౌండేషన్, పశువైద్య సిబ్బంది సహకారంతో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా నవగ్రహాల ప్రతిష్ట



సంగం: స్థానిక తిరుమనకొండపైనున్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో నవగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత విశేషాభిషేకాలు, పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం వేదపండితుల వేద మంత్రోచ్చారణల నడుమ నవగ్రహాలను ప్రతిష్ఠించారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి నవగ్రహాల విశిష్టతను భక్తులకు వివరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

పంచముఖ గణపతికి అద్దాల మండపం



మర్రిపాడు: డీసీపల్లిలోని పంచముఖ శక్తి గణపతి ఆలయం చుట్టూ అద్దాల ఏర్పాటు పనులను గురువారం ప్రారంభించారు. డీసీపల్లి మజరా కోనసముద్రం గ్రామానికి చెందిన దాతలు కన్నమనేని నాగేశ్వరరావు, అరుణ దంపతుల సహకారంతో అద్దాల మండపం పనులు చేపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి



సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న వెంకటయ్య

ఉదయగిరి: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య కోరారు. పట్టణంలోని బిట్–3 సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి ఇప్పటి వరకు ఎంత మంది నమోదు చేసుకున్నారో ఆన్‌లైన్‌లో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 2,736 మంది పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. ఎక్కువ మంది యువత నమోదు చేసుకునేలా మండలాధికారులు, సచివాలయ సిబ్బంది ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీ



గిరిజనులకు రేషన్ పంపిణీ చేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి



అల్లూరులో రేషన్ పంపిణీ చేస్తున్న తహసీల్దార్

సంగం: మిచాంగ్ తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడిన దువ్వూరు గిరిజన కాలనీకి చెందిన 25 కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన రేషన్‌ను దువ్వూరు పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సూరి మదన్‌మోహన్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కాలనీలోకి నీరు చేరడంతో 25 గిరిజన కుటుంబాలకు పీఏసీఎస్ కార్యాలయంలో పునరావాసం కల్పించినట్లు తెలిపారు. వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఉల్లిపాయలు, కందిపప్పు, నూనె ప్యాకెట్లను అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత సమీవుల్లా, ఈఓఆర్డీ రమేష్, వీఆర్వో ఖాజామస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన పేదలకు ప్రభుత్వం అందజేసిన రేషన్‌ను గురువారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఇస్కపల్లి సచివాలయంలో ఎంపీపీ శశిరేఖ చేతుల మీదుగా తుఫాన్ బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజీ నూనె, కేజీ కందిపప్పు, కేజీ ఉల్లగడ్డలు, కేజీ ఉల్లిపాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ వేణమ్మ, వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు బీద రమేష్, నాయకులు చెంతాటి కరుణాకర్, పాటి రంజిత్, భాస్కర్, రసూల్, శ్యామ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీ శాతాన్ని పెంచాలి



మాట్లాడుతున్న ఏజీఎం కామాక్షయ్య

ఉదయగిరి: ఉదయగిరి వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం పరిధిలో స్త్రీనిధి రుణాల రికవరీ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో వైకేపీ సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి కార్యాలయ పరిధిలో రూ.83 లక్షలు మేర స్త్రీనిధి రుణాలు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 80 శాతం మాత్రమే రికవరీ చేశారని, మిగిలిన నగదును నెలాఖరులోపు వసూలు చేయాలన్నారు. గ్రూపుల్లోని అర్హులైన సభ్యులకు రుణాలు ఇవ్వాలన్నారు. బ్యాంకు లింకేజీ కింద రూ.15 కోట్లు రుణంగా ఇవ్వడం జరిగిందన్నారు. లింకేజీ రుణాలను పొదుపు సభ్యులు సక్రమంగా చెల్లించేలా చూడాలన్నారు.

వాహనాల తనిఖీ

సోమశిల: మండలంలోని ముస్తాపురం అలుగు వద్ద ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. అధిక లోడుతో వెళ్తున్న లారీలు, ఆటోలు, ట్రాక్టర్లను గుర్తించి డ్రైవర్లకు సూచనలు చేశారు. అధిక లోడుతో వెళితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఇంద్ర సర్వీసు టికెట్‌పై 15 శాతం రాయితీ

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు–బెంగళూరు ఇంద్ర బస్సు సర్వీసు టికెట్‌పై ఈ నెల 31వ తేదీ వరకు 15 శాతం రాయితీని అందిస్తున్నట్లు ప్రజారవాణాశాఖ ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నీసా గురువారం తెలిపారు. ఇంద్ర సర్వీసులో బెంగళూరుకు టికెట్ రూ.1016 ఉండగా, 15 శాతం రాయితీపై రూ.883 కే అందజేస్తున్నామని వివరించారు. ఒకేసారి రానుపోను టికెట్ రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు మరో 10 శాతం రాయితీని అదనంగా అందజేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శరవేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు



చేజర్ల: ఆదూరుపల్లిలో విద్యుత్‌లైన్‌పై పడిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం



మర్రిపాడు: విద్యుత్ స్తంభాన్ని నాటుతున్న విద్యుత్ సిబ్బంది

మర్రిపాడు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌లైన్ల పునరుద్ధరణ పనులను విద్యుత్ శాఖ అధికారులు శరవేగంగా చేపడుతున్నారు. మండల విద్యుత్ శాఖ ఏఈ రామచంద్ర సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో మండలంలో 26 విద్యుత్ స్తంభాలు పడిపోగా 15 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఏఈ తెలిపారు.

చేజర్ల: తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురు గాలులు, భారీ వర్షాలకు మండలంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ చెట్లు విరిగి పడడంతో విద్యుత్‌లైన్లు ధ్వంసమయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్, జూనియర్‌లైన్‌మన్ కిరణ్ తమ సిబ్బందితో మూడ్రోజుల పాటు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో వారిని మండల ప్రజలు అభినందించారు.

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న వేదపండితులు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరులో ఇంద్రాక్షి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, కేతా మన్నేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజను గురువారం నిర్వహించారు. కుర్తాళం పీఠానికి చెందిన పండితులు మాచవోలు రమేష్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు పలుకూరు మురళీకృష్ణశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో ఆలయాలను నిర్మించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నీలకంఠునికి విశేష పూజలు



ఉదయగిరి: కార్తీక మాస ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని గండిపాళెం జలాశయ ప్రాంగణంలోని సిద్దేశ్వర స్వామి ఆలయంలోని నీలకంఠునికి గురువారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. పుష్పాలంకరణ దాతగా వైస్ఎంపీపీ గుంటుపల్లి మాల కొండయ్య చౌదరి, నాగేశ్వరమ్మ దంపతులు వ్యవహరించారు.

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి కృతజ్ఞతలు

అనుమసముద్రంపేట: ఆత్మకూరు నియోజకవర్గ రైతుల కోసం సోమశిల జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేయించేందుకు కృషి చేసిన ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాటంరెడ్డి నారసింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో డెల్టాకు మాత్రమే నీటిని విడుదల చేయాలని తీర్మానించారని చెప్పారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ రైతుల పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉత్తర కాలువ ద్వారా నీటిని విడుదల చేయిస్తున్నారని చెప్పారు. మరో రెండు రోజుల్లో సోమశిల ఉత్తరకాలువ ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

శబరిమలైకు తరలిన అయ్యప్పలు



ఆత్మకూరు: పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 200 మంది అయ్యప్పస్వాములు గురువారం శబరిమలైకు తరలివెళ్లారు. పట్టణంలోని శివాలయం వద్ద ఇరుముడులు కట్టుకుని ప్రత్యేక వాహనాల్లో శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. అయ్యప్పస్వాములను సాగనంపేందుకు తరలివచ్చిన బంధువులతో శివాలయం వద్ద కోలాహలం నెలకొంది. సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములతో పాటు వారి బంధువులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



చేజర్లలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

చేజర్ల: మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వీధుల్లో నిల్వ ఉన్న నీటిని, చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. కోటితీర్థం, టీకేపాడు, యనమదల, కాకివాయి, తిమ్మాయపాళెం పంచాయతీల్లోని వాటర్ ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేపట్టారు. పారిశుధ్య పనులను ఈఓపీఆర్డీ రామయ్య పర్యవేక్షించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

బిట్రగుంట: ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో బోగోలు మండలం తెల్లగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం మండల ఉపాధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి కలిగే నష్టాలు, పిల్లలు ఇష్టంగా తినే తినుబండారాల్లో ఉపయోగించే రసాయనాలు, వాటి కారణంగా కలిగే ఇబ్బందులను చిన్నచిన్న కథల ద్వారా విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అలవాటు చేసుకోవాలని, చిరుతిళ్లు తినడం తగ్గించి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఫోరం ప్రతినిధులు జీవన్‌కుమార్, అబ్రహాం, గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.